# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

DECEMBER 1995

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
(క్రీస్తు సంఘము)

# ఆహ్వానము

# గొప్ప బైబిల్ సెమినార్

తేదీలు : 1996 జనవరి 9వ తేదీ సోమవారం నుండి
14వ తేదీ ఆదివారం వరకు

ఉపన్యాసకులు : 1. Bro. జాన్ ఫోర్డ్, U.S.A.
2. Bro. రోజర్ రైట్, U.S.A.
3. Bro. జైల్స్ హెస్టర్, U.S.A.
మరియు
4. Sis. నేన్సీ ఫోర్డ్
(స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహింతురు)

సమయం : ప్రతిరోజు ఉదయం 10 గంటలకు
మధ్యాహ్నం 3-00 గంటలకు
మరియు సాయంకాలం 6-30 గంటలకు

స్థలం : KSP సెమినార్ హాలు
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్, కాకినాడ - 533 003

ఇండియాలో పలు రాష్ట్రముల నుండి ఈ సెమినార్ కు అనేక సోదరసోదరీలు వచ్చుచున్నారు. గొప్ప బైబిలు వర్తమానములు అందించబడుచున్నవి. ఈ గొప్ప సహవాసములోను, ఆత్మీయ విందులోను పాల్గొనుడి. దూర ప్రాంతముల వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యము కలదు.

**Nehemiah Gootam**
Director
Ph. 0884-72604 Off.
64882 Res.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-73722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 డిశంబరు 1995 సంచిక 5


## సంపాదకీయము

## రాజ్యమును ప్రకటించుట

## (Preaching The Kingdom)

అనేక ఆత్మీయ విషయాలపై నేటి ప్రపంచములో కొంత గజిబిజియున్నది. అందులో రాజ్యమును గూర్చి లేక సంఘమును గూర్చి మరియొక్కువగా యున్నది. సంఘము ఏమంత ప్రాముఖ్యముకాదని అనేకులు తలంతురు. అన్ని సంఘాలు ఒకటేగనుక నీకిష్టము వచ్చిన దానిలో సభ్యునిగా యుండవచ్చుని వారు భావిస్తారు. మనము బోధిస్తే క్రీస్తును గూర్చి యే బోధించాలి గాని సంఘమును గూర్చి, రాజ్యమును గూర్చి బోధించరాదని వారు చెబుతారు.

అయితే సంఘమును గూర్చి లేదా రాజ్యమును గూర్చి బైబిలు యేమిచెప్పుచున్నదో అనేకులు ఎరుగరు. మొదటిగా సంఘము, రాజ్యము రెండూ ఒక్కటే. మత్తయి 16:18,19 లో ఈ రెండు పదములను ఒకే సంగతిని గూర్చి చెప్పుటకు క్రీస్తు వినియోగించారు. కొలస్సయలోని సంఘ సభ్యులు దేవుని ప్రియకుమారుని రాజ్యసభ్యులని పౌలు చెప్పాడు (కొలస్స 1:13,14). ఎన్నడును నాశనముగావించబడని రాజ్యమును స్థాపింతునని పాతనిబంధనలో దేవుడు వాగ్దానము చేసెను (దానియేలు 2:44). అది యెరూషలేములో ప్రారంభించ బడునని యెషయా ప్రవచించాడు (యెషయా 2:2,3 ). మనము మత్తయి, మార్కు, లూకా, యోహాను వ్రాసిన సువార్తలను చదువుచుండగా, దేవుని రాజ్యము ఆసన్నమైయున్నదని బోధించుచు బాప్తిస్మ మిచ్చు యోహాను వచ్చినట్లు చూడగలము (మత్తయి 3:1,2). ఆనాడు జీవించియున్నవారిలో కొందరు దేవుని రాజ్యముబలముతో వచ్చుట చూచెదరని క్రీస్తు చెప్పెను (మార్కు 9:1), ప్రభువు పునరుత్థానుడైన తరువాత రాజ్యమునుగూర్చిన సంగతులను ఆయన అపొస్తలులకు చెప్పెను (అపొ.కా. 1:3).

ఈ విషయాలన్నీ యెరూషలేము వైపుకే సూచించుచున్నవి, మరియు క్రీ॥శ 33వ సంవత్సరములో, అపొస్తలులు పైనుండి శక్తి పొందిన తరువాత మొట్టమొదటిగా సువార్త ప్రకటింపబడెను. మరియు ఇంచుమించు మూడువేల మంది ఆనాడు బాప్తిస్మము పొందిరి. సంఘముతో చేర్చబడిరి(అపొ. కా.2). తరువాత ఫిలిప్పు అను సువార్తికుడు సమరయకు వెళ్లి వారికి క్రీస్తును గూర్చి ప్రకటించెను(అపొ.కా. 8:5). "అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసు క్రీస్తు నామమును గూర్చియు సవార్త ప్రకటించుచుండగావారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి" యని వ్రాయబడియున్నది (అపొ.కా.8:12).

రాజ్యము సంఘమనియే గాక క్రీస్తు శరీరమని కూడ చెప్పబడినది (I కొరింధీ 12:27), మరియు గొర్రెలదొడ్డియని (యోహాను10) చెప్పబడినది. సంఘమనగా యేమిటో, దాని ప్రాముఖ్యత యేమిటో తెలియ జేయుటకు ఇట్లు వర్ణించబడినది.

సంఘమనగా యేమిటి? అది రక్షింపబడిన వారితో సమకూడి యున్నది (మార్కు 16:16). వారు క్రీస్తు పై నిర్మించబడిన వారు (I కొరింధీ 3:11), ప్రభువు నామమును ధరించువారు (అపో.కా.4:12), మరియు క్రీస్తు రక్తము చే కొనబడినవారు (అపో.కా. 20:28).

అయితే రాజ్యమును గూర్చిగాని, సంఘమును గూర్చిగాని ఎందుకు బోధించాలి? సంఘము రక్షించునా? కాదు, అది రక్షించదుగాని, అది రక్షింపబడినవారి సమూహము గనుక క్రీస్తే దాని రక్షకుడై యున్నారు (ఎఫెసీ5:23). దానిని గూర్చి ప్రజలకు తెలియజేయబడాలి. దాని ప్రాముఖ్యతను వారు గ్రహించుకోవాలి దాన్ని గూర్చి అప్పుడు ప్రకటించబడింది. ఇప్పుడూ ప్రకటించబడాలి.

సంఘమును గూర్చి తెలిసికోకుండా, దానిలో సభ్యుడు కాకుండా యుంటే ఒకడు రక్షింపబడలేడు. ఒకడు రక్షింపబడితే తక్షణమే క్రీస్తు సంఘ సభ్యుడవుతాడు. క్రీస్తు అతనిని తన సంఘముతో చేర్చుకొంటాడు (అపో.కా.2:47). అయితే ఒకడు క్రీస్తు సంఘ సభ్యుడు కాకపోతే అతడు రక్షింపబడినవాడు కాదు. మనము క్రీస్తును ఆయన సంఘమును ప్రకటించునప్పుడు యేమి చేయుదుము? క్రీస్తు దేవుని కుమారుడని, ఆయన సిలువపై మన కొరకు మరణించెనని ప్రకటించుచున్నాము ( యోహాను 3:16,17). మనము రాజ్యమును గూర్చి లేక సంఘమును గూర్చి ప్రకటించు చున్నప్పుడు, సంఘమే రక్షకుడనిగాక, రక్షింపబడిన వారితో సమకూడిన క్రీస్తు

సంఘమును ప్రజలకు పరిచయము చేయుటకు అట్లు చేయుచున్నాము.

నీవు క్రీస్తు సంఘమును వ్యతిరేకించుచున్న యెడల క్రీస్తునే వ్యతిరేకించు చున్నావని గమనించుకొనుము (అపో.కా.9). నీవు క్రీస్తును అంగీకరించునప్పుడు ఆయన సంఘమును కూడ అంగీకరింతువు. ఏలయనగా భూమి మీద ఆయన ఆత్మీయ శరీరము సంఘమే. ఆయన సంఘమును ప్రేమించుచున్నాడు. మనము కూడ దాన్ని ప్రేమించి, దానిలో సభ్యులమై నమ్మకముగా జీవించుచు ఆయనను సంతోషపెట్టాలి.

# బైబిలును అర్ధము చేసికొనుటకు పది సూత్రములు

# (Ten Simple Reasons to understand the Bible)

(జూలై నెల సంచిక తరువాయి)

## 5. పాతక్రొత్త నిబంధనల వ్యత్యాసమును గమనించుము:

పాతనిబంధన చట్టము మనకు వర్తించకుండుటకై క్రీస్తు దానిని ఎత్తివేసి క్రొత్త నిబంధనను గ్రహించెను. పాతనిబంధనలోని నైతిక వర్తనమును మతాచారములను గమనించి అవి క్రొత్త నిబంధనకు వేరుగా యున్నవి గనుక ప్రజలు గలిబిలియగుదురు. పాతనిబంధన ప్రజలు భిన్నమైన మతపద్ధతికి లోనై జీవించిరి. కొందరు పితరుల యుగమును నక్షత్రకాంతికిని, యూదులయుగమును చంద్రకాంతికిని, క్రైస్తవ యుగమును సూర్యకాంతికిని పోల్చుదురు. ఈ యుగంలో దేవుని యొక్క పూర్తిబయల్పాటు యొక్క వెలుగు ప్రకాశించెను.

క్రీస్తు ఈ లోకమున కవతరిస్తాడని, దేవుడొక నూతన నిబంధనను అనుగ్రహిస్తాడని దేవుని ప్రవక్తలు ముందుగనే ప్రవచించిరి (యిర్మియా 31:31-33). క్రీస్తు మరణము తరువాత అందరు పాతనిబంధన క్రిందగాక, క్రొత్త నిబంధన క్రిందనే యుందురని హెబ్రీ పత్రిక వక్కాణించుచున్నది.

- "దేవుడు మన పితరులతో ప్రవక్తల ద్వారా మాటలాడెను, గాని ఇప్పుడు ఆయనే కుమారుని ద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1:1).
- " అవశ్యముగా యాజకధర్మము మార్చబడెను" (హెబ్రీ 7:12).
- " క్రొత్త నిబంధన అని చెప్పుటచేత ఆయన మొదటిది పాతదిగా చేసియున్నాడు'' (హెబ్రీ 8: 13).
- " ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు" (హెబ్రీ 9:15-17).
- " ఆయన క్రొత్త నిబంధనను స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టివేయుచున్నాడు" (హెబ్రీ 10:9,10).

పాతనిబంధన ఒక చట్టముగా నేటి ప్రజలకు వర్తించుట లేదని, దానిని క్రీస్తు ఎత్తివేసెనని చెప్పుటకు అనేక లేఖనములను . మనం ఇంకా ఇయ్యవచ్చును.అది సిలువకు మేకులతో కొట్టివేయబడెను (కొలస్స 2:14). మనలను క్రీస్తునొద్దకు నడిపించుటకు పాతనిబంధన బాలశిక్షకుడాయెను. అయితే క్రీస్తు వెల్లడి ఆయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము (గలతీ 3:23-25).

## 6. బైబిలును 66 పుస్తకములుగల ఒక గ్రంథాలయముగ పరిగణించుము:

విశిష్టమైన సంగతుల కొరకు సరియైన స్థానములో వెదకుము. బైబిలునందు రెండు ముఖ్య భాగములున్నవి - పాతనిబంధన. క్రొత్త నిబంధన, క్రీస్తు

రాకముందు సంభవించిన సంగతులు పాతనిబంధనలో గలవు. అయితే నేడు మనకు దానిలో అనేక పాఠములున్నాయి (1 కొరింథీ 10:11). క్రీస్తురాక ముందున్న ప్రజలతో దేవుడు ఆధ్యాత్మికంగా సంప్రదించిన పద్ధతి యిది. ఆనాటి విశ్వాసవీరులను గూర్చి నేడు మనం చదివితే ధైర్యము లభిస్తాది. దేవునికి విధేయత చూపిన వారిని గూర్చి అవిధేయత చూపినవారిని గూర్చి అనేక మాదిరులు మనం దానిలో చదివి, దేవుడు ఎల్లప్పుడు విధేయతనే కోరాడని తెలిసికోగలం. క్రీస్తురాక కొన్నివందల సంవత్సరముల ముందే చెప్పబడిన ప్రవచనాలను చదువుటద్వారా మన విశ్వాసం బలపడగలదు.

పాతనిబంధనలో 4 విభాగములున్నవి. వాటిలో సంగ్రహించబడిన అంశములను బట్టి అవి విభాగింపబడినవి.

## I. మోషే ధర్మశాస్త్రము: మొదటి ఐదు పుస్తకములు.

ఆదికాండము - ఇందు మోషే సృష్టిని గూర్చి, మానవుని ఆరంభచరిత్రను గూర్చి చెప్పుచున్నాడు. ఇందు దేవుడు అబ్రాహాముకు 'భూమి యొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడునని" చేసిన వాగ్దానము మనకు కనబడును (ఆది.కా. 12:1-3; 22:18). క్రీస్తే ఆ సంతానమైయున్నాడు (గలతీ 3:16-19;మత్త 1:1). అబ్రాహాము మనుమడైన యాకోబు పేరును ఇశ్రాయేలుగా దేవుడెట్లు మార్చాడో ఆదికాండము 35:10 తెలియజేయుచున్నది.

పాతనిబంధనలోని మిగతాపుస్తకములు ఇశ్రాయేలీయులతో ఒకజనాంగముగా దేవుడెట్లు సంప్రదించాడో తెలియజేయుచున్నవి. ఆ జనాంగము నుండి యే క్రీస్తు రావలసియుండెను. క్రీస్తువచ్చిన తరువాత దేవుడు ఇశ్రాయేలీయులకు యితరులకు మధ్య వ్యత్యాసము లేకుండ జేసెను (అపొ.కా. 15:9).

**నిర్గమకాండము:** ఐగుప్తు బానిసత్వము నుండి ఇశ్రాయేలీయులు నిష్క్రమించుటను గూర్చి నిర్గమకాండము చెప్పుచున్నది. 20వ అధ్యాయము ధర్మశాస్త్రము ఇచ్చుటను గూర్చి చెప్పుచున్నది. వారు దానిలోని మాదిరిననుసరించి దేవుని నారాధించాలి, సేవించాలి(నిర్గమ 34:40).

**లేవీకాండము:** యాజకులైన లేవీయులు జరిగించవలసిన మతసంబంధ విధులను గూర్చి ఈ పుస్తకము చెప్పుచున్నది.

**సంఖ్యాకాండము:** ఇంచుమించు ఆరులక్షల మంది యొక్క జన సంఖ్యనులెక్కించుటను గూర్చియు, 40 సంవత్సరముల మట్టుకు దేవుడు అరణ్యముగుండా వారిని నడిపించుటను గూర్చియు ఈ పుస్తకము చెప్పుచున్నది.

**ద్వితీయోపదేశకాండము:** దేవుని ధర్మశాస్త్రము రెండోసారి వినిపించబడుటను గూర్చియు, దానికి ప్రజలు లోబడుటను గూర్చియు ఇందు వ్రాయబడియున్నది. దేవుడు ఇశ్రాయేలీయులను కానానుకు నడిపించుచున్నాడు. వారక్కడ స్థిరపడిన తరువాత ఆయన ధర్మశాస్త్రమును వారు మరచిపోకూడదని ఆయన అభిమతమైయుండెను. వారు దానికి లోబడాలని, దాన్ని తమ పిల్లలకు ఉపదేశించాలనీ ఆయన కోరెను.

## II. చరిత్ర గ్రంథములు - 12 చరిత్ర పుస్తకములు

తరువాత 12 పుస్తకములు యెహోషువ గ్రంథమునుండి ఎస్తేరు గ్రంథమువరకు వెయ్యేండ్ల కంటే పైగా దేవుడు తన ప్రజలతో సంప్రదించిన విధానమును గూర్చి తెలియజేయుచున్నవి. ఇశ్రాయేలీయులు యొర్దాను నదిని దాటునట్లు దానిలో ఆయన ఆరిన నేలను ఎట్లుకలుగ జేసెనో యెహోషువ గ్రంథము తెలియజేయుచున్నది. తరువాత వాగ్దాన దేశములో వారు స్థిరపడిన విధానము కూడ అది తెలియ జేయుచున్నది. మోషే ద్వారా ఇయ్యబడిన

ధర్మశాస్త్రమునుండి కుడికిగాని ఎడమకు గాని తొలగకూడదని దేవుడు మరియొకసారి వారికి జ్ఞాపకము చేసెను (యెహోషువ 1:7-8). అయితే ఈ 12 గ్రంథములను చదువుట ద్వారా వారు నైతికంగాను, ఆత్మీయకంగాను దేవుని నుండి ఎట్లు తొలగిపోయారో మనకు తెలియనగును.

III. పద్యకావ్యగ్రంథములు - దైవ ప్రేరిత 5 పద్యకావ్యములు

- యోబు గ్రంథము, శోధన బాధలలో దేవునియందు నమ్మికను గూర్చి చెప్పును.
- క్రీర్తనల గ్రంథము-దేవునియందలి విశ్వాసమును, ఆయనను స్తుతించుటను గూర్చి చెప్పును.
- సామెతల గ్రంథము - అనుదిన జ్ఞానము కొరకైన వివేక వచనములు
- ప్రసంగి గ్రంథము - ఈలోకములోని ధన ధాన్యములు, సంపత్తి, సుఖ భోగములన్నిటికంటె దేవుని సేవించుట ఉత్తమమని చెప్పును.
- పరమ గీతము-వైవాహిక జీవిత మధురాన్ని సంఘము యెడల క్రీస్తుకున్న ప్రేమతో పోల్చి చెప్పును.

IV. ప్రవచన గ్రంథములు - ప్రవచనములతో కూడిన 17 గ్రంథములు. ప్రవక్తల యొక్క ఈ 17 పుస్తకములు దేవుని ప్రజల చరిత్రను మనకు చెప్పును. వారు అవిధేయతతో యుండిన యెడల ఏమి జరుగునో ప్రవక్తలు పలికేవారు. అది అట్లే జరిగేది ! వారు క్రీస్తు యొక్క జనన మరణములను గూర్చి, ఆయన సంఘమును గూర్చి కూడ ప్రవచించిరి.

క్రొత్త నిబంధనలో కూడ 4 విభాగములున్నవి :

I. క్రీస్తు చరిత్ర - 4 పుస్తకములు

క్రీస్తు జీవిత చరిత్రను ఇద్దరు అపొస్తలులు, మత్తయి, యోహాను (యోహాను 14:26) మరియు ఇద్దరు దైవ ప్రేరిత లేఖకులు మార్కు, లూకా వ్రాసిరి (ఎఫెసీ 3:4-5). యేసు యొక్క జీవితంలోని గొప్ప సంఘటనలను ఇవి చెప్పుచున్నవి. సర్వ జనాంగములు గ్రహించుకొను రీతిగ ఈ నాలుగు పుస్తకములు వివిధ దృక్కోణముల నుండి క్రీస్తు చరిత్రను తెలియ జెప్పుచున్నవి. మత్తయి మొదటి అధ్యాయము, లూకా 1,2 అధ్యాయములు యేసు కన్య మరియకు జన్మించిన విధానమును చెప్పును. సిలువ పై ఆయన మరణం, సమాధి, పునరుత్థానములను గూర్చి ఈ నాలుగు పుస్తకములలోని ఆఖరి అధ్యాయములు తెలియజెప్పును. యేసు చేసిన గొప్ప బోధలు ఇందులో యున్నవి. మనమాయనను వెంబడించు వారమైన యెడల ఆయన ఉపదేశములను సహృదయముతో పఠించాలి, అంగీకరించాలి.

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన శిష్యులు సర్వలోకముకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించాలనే గొప్ప ఆజ్ఞ యిచ్చెను (మత్తయి 28:19-20; మార్కు 16:15; లూకా 24:46-47). సువార్త వాక్యమును వినువారు విశ్వసించాలి, మారు మనస్సు బొంది బాప్తిస్మము పొందాలి. అపొస్తలుల కార్యముల గ్రంథము వారీ యాజ్ఞను పాటించినట్లు తెలియజేయును.

II. **సంఘచరిత్ర** - ఒకే ఒక్క పుస్తకము, ఆదిమ సంఘచరిత్రను తెలియజేయును.. అపొస్తలుల కార్యముల గ్రంథము కొందరు అపొస్తలుల యొక్కయు మిగతావారి యొక్కయు ఆదిమ సంఘారంభమును గూర్చిన కార్యములను తెలియజేయును. అపొస్తలులకార్యములు మొదటి అధ్యాయము

క్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను జ్ఞాపకము చేయును. 9-11 వచనములు క్రీస్తు పరమందున్న తండ్రి యొద్దకు ఆరోహణుడగుటను గూర్చి తెలియజేయును. రెండవ అధ్యాయములో అపొస్తలులు ప్రత్యేకముగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటను గూర్చి చదువగలము. క్రీస్తుసువార్తను వారు లోకమంతటా బయలుపర్చాలి. ఆదినమందు క్రీస్తు సంఘము ఆరంభమాయెను. ఆయనను సిలువవేయుడియని అరచిన మూడు వేలమంది ఆయన యందు విశ్వసించి, మారుమనస్సుపొంది, బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:36-41). క్రీస్తు వారిని తన సంఘముతో చేర్చుకొనెను (అపొ.కా. 2:41,47; మత్తయి 16:18).

అపొస్తలుల కార్యముల గ్రంథములోని మిగతా అధ్యాయములు క్రైస్తవుల యొక్క ఉత్సాహమును, సంఘాభివృద్ధిని తెలియజేయును. అనేకులు విగ్రహములను వీడి, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందిరి (అపొ.కా.8:35-38;16:29-33;18:8).

**III. పత్రికలు : క్రైస్తవులకు వ్రాయబడిన 21 ఉత్తరములు**

ప్రజలు క్రైస్తవులెట్లయ్యారో అపొస్తలుల కార్యముల గ్రంథము తెలియజేయుచున్నది. తరువాత 21 పుస్తకములు క్రైస్తవులైన వారికి వ్రాయబడిన ఉత్తరములు. కొన్ని పత్రికలు ఆయా వ్యక్తులకు వ్రాయబడినవి.ఉదాహరణకు పౌలు తిమోతికి, తీతుకు వ్రాసిన పత్రికలు, మిగతావి ఆయా ప్రాంతములలో యున్న సంఘములకు, వారిని హెచ్చరించుటకు, సరిదిద్దుటకు గద్దించుటకు వ్రాయబడినవి.

రోమా పత్రిక నుండి ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రిక వరకు యున్న

13 ఉత్తరములు పౌలుచే వ్రాయబడెను. హెబ్రీ పత్రిక కూడ అతనే వ్రాసియుండవచ్చును. మిగతావి యాకోబు, పేతురు, యోహాను, యూదాలచే వ్రాయబడెను. అవన్నీ మొత్తం 21 పత్రికలుంటాయి.

క్రైస్తవులకు వ్రాయబడిన పత్రికలన్నీ వ్యక్తిగత దైనందిన భక్తిజీవితమును గూర్చియు, నిస్వార్థమైన ప్రేమను గూర్చియు చెబుతాయి. సంఘము యొక్క నిర్మాణ పద్ధతి, ఆరాధన యెట్లుండవలెనో కూడ అవిచెబుతాయి. వివిధ డినామినేషన్లవలె గాక సంఘము ఏకమై యుండాలనే దేవుని కోరిక కూడ వాటిలో వ్యక్తమవుతాది. అందువలన ఆదిమ సంఘము ఎట్లుండెనో మనము తెలిసికోవాలంటే ఈ పత్రికలు తప్పక చదవాలి.

IV. **ప్రవచనము :** ఒకే పుస్తకం ప్రకటన గ్రంథము

"త్వరలో సంభవింపబోవు సంగతుల" బయల్పాటును క్రీస్తు యోహానుకు తెలియ పరచెను (ప్రకటన 1:1). ప్రకటన గ్రంథమంతయు ఎక్కువ గురుతులతోను, అలంకారరీతిగాను లిఖించబడెను. దాని లోని గురుతులకు పలు భావార్థాలు చెప్పుటగాక బైబిలు యొక్క బోధను మనం క్షుణ్ణంగా అర్థం చేసికొనిన యెడల, మనం ప్రకటన గ్రంధము నర్థము చేసికోగలము. అయితే ఎన్నిశోధనలు సంభవించినను దేవుడు తన సింహాసనము పై నున్నాడు, సత్యమే విజయం సాధించుననే గొప్ప సంగతిని మనము గ్రహించుకో గలము. దానిలోని ఆఖరి అధ్యాయములు క్రైస్తవుని పరలోక గృహాన్ని వర్ణిస్తాయి. (సశేషము).

- చార్ల్స్ స్కాట్

# మొదట అతడు తన తమ్ముని కనుగొనెను
# (The first thing He did was to find his brother)

బాప్తీస్మమిచ్చు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి "ఇదిగో లోక పాపములను మోసి కొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని తన శిష్యులతో చెప్పెను. వారిలో ఇద్దరు వెంటనే ఆయనను వెంబడించిరి. వారు ఆ దినమంతయు ఆయన యొద్ద బస చేసిరి. యోహాను మాటవిని ఆయనను వెంబడించిన ఇద్దరిలో ఒకడు సీమోను పేతురు యొక్క సహోదరుడైన అంద్రెయ. ఇతడు మొదట తన సహోదరుడైన సీమోనును చూచి మేము మెస్సీయానుకనుగొంటిమని అతనితో చెప్పెను. (యోహాను 1:35-41).

నీవు నీ తమ్ముని వెదకి నా యొద్దకు తీసికొనిరమ్మని యేసు అతనితో చెప్పలేదు కాని అంద్రెయ అతనిని వెదకుటకు వెళ్ళెను. అతనికి మెస్సీయను కనుగొంటిననెడి నమ్మకము కల్గియున్నందున మరియు అతని సహోదరుడైన సీమోను పేతురుపై గల ప్రేమ వలన అంద్రెయ పేతురు కూడా యేసుతో ఉండాలని ఆశపడ్డాడు.

యేసు మానవ కుటుంబము కొరకు ఏమిచేయగలడో అనే గుర్తింపు, దేవుని కొరకు ఆత్మలను సంపాదించుటకు మనలను పురికొల్పుచున్నది. ఆయన ప్రపంచమంతటికి రక్షకుడని మనము నమ్మినట్లయితే మనము ఆయన కొరకు ఆత్మలను సంపాదించాలి. నిజానికి వేరొకరిని మనము చేర్చాలి. అంద్రెయ తనతమ్ముని ప్రేమించాడు కనుక ఎప్పుడైతే తనంతట తానుగా రక్షకుని కనుగొన్నాడో వెంటనే అతని స్వంత సహోదరుడైన సీమోను కొరకు ఆలోచన చేసాడు. అది అవధులు దాటిన ప్రేమ. ఇది పిరికి తనముకాదు. లేక సిగ్గు కాదు. అసాధ్యమైన దాన్ని అది చేయును. ఇతరులతో వారి ఆత్మలను

గూర్చి మాట్లాడుటకు మనము ధైర్యాన్ని సమకూర్చుకోవాలి. రక్షకుడు లేకుండా చాలా మంది నశించి పోవుచున్నారని మనము గుర్తించినట్లయితే మనము సాధారణ పరిస్థితులలో చేయలేని కార్యములను కూడా చేయగల్గుటకు పురికొల్పబడుదుము.

ఆసక్తి దాయకమైనదేమనగా అంద్రెయ యేసును వెళ్ళి తన తమ్మునితో మాట్లాడుమని అడుగలేదు. పేతురు తన్ను ఎరిగినవాడు మరియు అతడు చెప్పినదానిని నమ్మేవాడని అంద్రెయ తలంచెనేమో. ఒక క్రొత్త వ్యక్తి చెప్పినది అనగా ఆ క్రొత్త వ్యక్తి క్రీస్తు అయినప్పటికి పేతురు తిరస్కరించునేమో అని అంద్రెయ తలంచి యుండవచ్చు. అందుచేత యేసు నొద్దకు వచ్చుటకు తిరస్కరించుటకు పేతురుకు అతడు అవకాశమియ్యలేదు. ఆ పనిని తనంతట తానే అంద్రెయ నిర్వహించాడు. ప్రేమ ఆ విధంగా పనిచేస్తుంది.

చాలామంది దేవుని ప్రజలు క్రీస్తునొద్దకు ఏ ఒక్కరిని తీసికొనివచ్చుట లేదు."నేను ఆ పనికి నియమింపబడలేదు. నాకు ఏమి చెప్పాలో తెలియదు "అని మనలను మనము సమర్థించుకుంటాము. వ్యతిరేకతను గూర్చిన భయము లేక మన స్నేహితులను బాధ పెట్టుచున్నామేమోననే భయం. ఏది ఏమైనప్పటికి మనము అనవసరమైనవాటి గురించే ఆలోచింతుము. యేసు లోకరక్షకుడయినట్లయితే, మరియు మానవుడు ఆయన లేకుండా నశించి పోతున్నట్లయితే, ఎవరైతే క్రీస్తునొద్దకు తీసికొని రాబడరో వారు శాశ్వతముగా పోగొట్టుకొన్న వారవుదురు. నశించిపోవుచున్న స్నేహితుని కొరకు గొప్ప కార్యము చేయుట మనకు ఘనమైన బాధ్యతకాదా? ఆవశ్యముగా నిత్యత్వమును పోగొట్టుకొనుచున్న లేక నశించిపోవుచున్న స్నేహితునికొరకు బాధ్యత వహించుట గొప్ప తరుణమైయున్నది. అందుచేతనే ప్రభువు ఈ బాధ్యతను మనకు అప్పగించాడు: "మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయండి" (మత్తయి 28:19).

కొంతమంది ఆత్మలను సంపాదించిన సోదరులు నాకు తెలియును. వారికి మంచి చదువులేదు. వారు బైబిలు తరగతిలో గాని, ఆదివారమున గాని వారు బోధించలేరు. వారికి మంచి వ్యాకరణ పరిజ్ఞానము లేదు. బైబిలు ప్రశ్నలకు సరియగు రీతిలో సమాధానమివ్వలేరు. కాని వారు క్రీస్తును ప్రేమించుచున్నారు. మరియు నశించిపోవుచున్న స్నేహితులను ప్రేమించుచున్నారు కనుక వారు ఇరువురను దగ్గఱ చేయుచున్నారు.

యేసుతో కూడా కొద్దిగంటలు మాత్రమే యున్న అంద్రెయకు యేసునుగూర్చి ఎంతమట్టుకు తెలియును? ఇప్పటివరకు యోహాను శిష్యుడిగా యున్నాడు. తనకు తెలియనటువంటి యేసును వెంబడించిన రోజుననే అతడు మార్పు చెందాడు. పేతురు అనేక ప్రశ్నలు అడిగి యుండవచ్చు. ఆ ప్రశ్నలకు జవాబిచ్చుట అంద్రెయకు కష్టతరముగా తోచి యుండవచ్చు. అయినను అంద్రెయ పేతురుకు జవాబులు చెప్పియుండవచ్చు.

కాని మనము తెలిసికొనవలసినది ఏమనగా - అంద్రెయ మొదట తన సహోదరుడైన పేతురును గూర్చి ఆలోచన కలిగి యున్నాడు. వెంటనే అతనిని యేసువద్దకు తీసికొని వచ్చాడు. అతడు పేతురును ప్రేమించాడని తెలియుచున్నది. యేసుతో కొద్దిగంటలు మాత్రమే యున్న అతడు యేసునందు విశ్వాసముంచాడు ( మనలో చాలామంది సంఘములో చాలా కాలమునుండియున్నను క్రీస్తుకొరకు ఒక్కరినికూడా తీసికొనివచ్చుటకు ప్రయత్నించుట లేదు).

ఆదిమ సంఘము ఆత్మలను సంపాదించుటలో ఆసక్తి కల్గియున్నది. యెరూషలేములోని వారంతా యేసును మరియు సంఘమును ఎరిగినవారు. అధికారులు వారిని బాధించినను వారు ఆత్మలను సంపాదించుట యందు కొనసాగుచునేయుండిరి. లూకా ఈలాగు వ్రాసెను: వారు "ప్రతిదినము

దేవాలయములోను ఇంటింటను మానక బోధించుచు యేసే క్రీస్తని ప్రకటించుచుండిరి". (అపో. కా.5:42).

ఎంత గొప్ప రక్షకుడు! ఎంత గొప్ప సువార్త ! ఎంతగొప్ప సవాలు !

- హార్వే పోర్టర్ **(vot)**

# పగ తీర్చుకొను చట్టము

# (The Law of Retaliation)

## మత్తయి 5:38-42

ఏదేను వనము నాటినుండి నేటివరకు దేవుని వాక్యాన్ని అపవాది సంబంధులు కలిపి చెరుపుచున్నారు; దానికి తప్పు భావార్థములు చెప్పుచున్నారు. ధర్మశాస్త్రము యొక్క ఆత్మీయ భావమునుమరచి, యేసు ప్రభువుకాలమునాటి యూదా మతగురువులు దాని అక్షరార్థము చెప్పుచు, జరిగించుచున్నారు. వారు దేవుని వాక్యమును తద్వారా నిరర్థకము చేసి యున్నారు. యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగము కొన్ని నియమావళుల పట్టికకాదు. అది మానవుడు సాటి మానవుని యెడల, దేవుని యెడల ప్రదర్శింపవలసిన సంబంధ బాంధవ్యాలు, భక్తిభావాలను గూర్చి ఆయన చెప్పారు. ఆయన "దెబ్బకు దెబ్బ' అనే చట్టాన్ని గూర్చి యేమి బోధించారో ఈ రోజుతెలిసికొందాము. ఆయన ఇట్లన్నారు:

"కంటికి కన్ను, పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా. నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక నిన్ను కుడి చెంపమీద కొట్టువాని వైపునకు ఎడమ చెంపకూడ త్రిప్పుము. ఎవడైన నీమీద వ్యాజ్యెము వేసి నీ అంగీ తీసికొన గోరిన యెడల వానికి నీ పై వస్త్రమును కూడ ఇచ్చి

వేయుము. ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల, వానితో కూడ రెండు మైళ్ళు వెళ్లుము. నిన్ను అడుగు వానికిమ్ము, నిన్ను అప్పు అడుగ గోరువానినుండి నీముఖము త్రిప్పుకొనవద్దు" (మత్తయి 5:38-42).

## దెబ్బకు దెబ్బ

ఈ చట్టము పాత నిబంధనలో మూడుసార్లు చెప్పబడింది. పరుని ద్వారా హాని కలిగిన యెడల నీవు "ప్రాణమునకు ప్రాణము, కంటికి కన్ను, పంటికి పన్ను, చేతికి చెయ్యి, కాలికి కాలు, వాతకు వాత, గాయమునకు గాయము, దెబ్బకు దెబ్బయు నియమింపవలెను" అని నిర్గమ 21:20-35 వరకు వ్రాయబడియున్నది. "విరుగ గొట్టబడిన దాని విషయములో విరుగ గొట్టుటయే శిక్ష" అని లేవీ 24:20 లో వ్రాయబడి యున్నది. "నీవు ఎవనిని కటాక్షింపకూడదు. ప్రాణమునకు ప్రాణము, కంటికి కన్ను, పంటికి పల్లు, చేతికి చెయ్యి, కాలికి కాలు మీకు విధి" యని ద్వితీ 19:21 లో వ్రాయబడి యున్నది.

పాతనిబంధన కాలములో దెబ్బకు దెబ్బ అనే ఈ శాసనము యుక్తమైన శాసనమే. అయితే దీనిని అమలు పరచువారు న్యాయాధిపతులేగాని, సామాన్యమానవులు కారు. అందువలన ఎవరికి వారే ఈ శాసనమును ఉల్లంఘించకూడదు. న్యాయమును లేక శిక్షను అమలు పరచేటప్పుడు అది బహిరంగముగా అమలుపరచవలెను. "యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. శపించిన వానిని పాళెము వెలుపలికి తీసికొని రమ్ము; వాని శాపవచనమును వినిన వారందరు వాని తలమీద చేతులుంచిన తరువాత సర్వసమాజము వానిని రాళ్లతో చావగొట్టవలెను" (లేవీ 24:14). సరిగదా అపరాధము చేసిన వానిని బాగుగా విమర్శించిన తరువాతను, ఇద్దరు ముగ్గురు సాక్షుల మాట మీద స్థిరపడిన తరువాతనే అతనికి శిక్ష విధింపవలెను (ద్వితీ

19:15-21). దీనిని బట్టి ధర్మ శాస్త్రము యొక్క ముఖ్యోద్దేశము పగతీర్చుకొనుటకాదుగాని, అరాచకాన్ని అరికట్టుటయే యని మనం గ్రహించాలి.

నిజానికి "ధర్మశాస్త్రము ధర్మవిరోధులకును, అవిధేయులకును, భక్తిహీనులకును, పాపిష్టులకును, అపవిత్రులకును, మత దూషకులకును, పితృహంతకులకును, మాతృహంతకులకును నరహంతకులకును వ్యభిచారులకును పురుషసంయోగులకును మనుష్యచోరులకును, అబద్ధికులకును, అప్రమాణికులకును, మితబోధకు విరోధియైనవాడు మరి ఎవడైన ఉండిన యెడల అట్టివానికి నియమింపబడెనుగాని నీతిమంతునికి నియమింపబడలేదు'' (1 తిమో 1:9-11). చట్టప్రకారము నడుచు కొనే వానిపై చట్టానికి అధికారము లేదుగదా.

## కీడుకు ప్రతి కీడు చేయరాదు

ధర్మశాస్త్రము యదార్థమైనది. ప్రతి అతిక్రమము, అవిధేయత దానివలన న్యాయమైన ప్రతిఫలము పొందే అవకాశమున్నది (హెబ్రీ 2:2). అది కరుణగలది ఏలయనగా కంటికి బదులుగా ప్రాణమును తీసికొనుటకు అది సహించలేదు. అది దుర్మార్గుల ప్రవర్తనను అరికట్టుట కీయబడిన చట్టము.

అయితే శాస్త్రులు పరిసయ్యులు ఈ చట్టమును తమ స్వార్థప్రయోజనాలకొరకు వినయోగించుచుండిరి. సామాన్య ప్రజలు పగతీర్చుకొనుటకు ధర్మ శాస్త్రములో చెప్పబడిన రీతిగ దెబ్బకు దెబ్బ తీసికోవచ్చుని వారి వాదన. కీడుకుప్రతికీడు చేయాలని ప్రతిమానవుడు తలుస్తాడు. అయితే, "మీకు మీరే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి. పగతీర్చుటనాపని, నేనే ప్రతి ఫలిమిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడు" (రోమా 12:19). నూతన నిబంధనము ప్రకారము క్రీస్తు ఆత్మ మానవునిలో పని చేసి, అతని మార్పు చేసి, దుర్మార్గతను ఎదిరించు వానిగ చేయును. యేసుక్రీస్తు యొక్క శ్రేష్టమైన

నియమము ఈలాగు చెప్పుచున్నది: "మిమ్మును హింసించువారిని దీవించుడి; ఏడ్చువారితో ఏడ్చుడి... కీడుకుప్రతి కీడు ఎవనికి చేయవద్దు.. మీకు మీరే పగతీర్చు కొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి... కాబట్టి నీ శత్రువు ఆకలిగొని యుంటే అతనికి భోజనముపెట్టుము, దప్పిగొని యుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము" (రోమా 12 : 14-21).

నీ శరీరానికి ఎవడైనా గాయము చేస్తే నీవు తిరిగి గాయము చేయవద్దని ప్రభువు బోధించారు. నీ కుడిచెంప మీద ఎవడైనను కొడితే అది నీకు అవమానమేకాదు, గాయంకూడాను. అయితే దాన్ని ఓర్పుతో సహించాలి. యేసును అక్రమముగా వారు కొట్టినను ఆయన తిరిగి కొట్టలేదు (యోహాను 18:23). హింసలకు మనం తల ఒగ్గితే మరిన్ని హింసలు రావచ్చును. అట్టి సందర్భాలలో నీ ఎడమ చెంప కూడ త్రిప్పుము. అంటే నిన్ను కొట్టిన వానిని నీవు క్షమించుచున్నావన్నమాట. అట్లు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పలుగా పోయుదువు (సామె 25:22). ఎవడైనా తిరిగి కొట్టినప్పుడు మాత్రమే కలహము చెలరేగునని గ్రహించాలి.

## ఓర్పుతో సహించాలి

క్రైస్తవుడు ఒకవేళ తన ఆస్థికి నష్టము వాటిల్లినను దానిని ఓర్పుతో సహించాలి. "ఎవడైన నీమీద వ్యాజ్యెము వేసి నీ అంగీతీసికొనగోరిన యెడల వానికి నీ పై వస్త్రమును కూడ ఇచ్చివేయుము". అబద్ధ ఆరోపణలు, సాక్ష్యాధారాలు చూపించి ఆస్థిని కాజేసేవారు ఈ లోకం అంతా నిండియున్నారు. ఈ లోకంలో విమర్శస్థానమున దుర్మార్గత జరుగుటయు, న్యాయముండవలసిన స్థానమున దుర్మార్గత జరుగుటయు సహజం (ప్రసంగి 3:16;5:8). అట్టి సందర్భాలలో నేడును సహించుమని ప్రభువు చెప్పుచున్నారు. అలాగ సహించుట

వలన ఇంకా నష్టము వాటిల్లుచున్నయెడల, దానిని ఇంకా భరించు. ఒకడు నీ అంగీ అడిగితే పై వస్త్రాన్ని కూడ ఇచ్చివేసేయి. నీవు న్యాయస్థానములో వ్యాజ్యెమాడితే ఈ రెంటికన్నా, నీ కయ్యే కోర్టు ఖర్చులే ఎక్కువ వుతాయి. నీలో ఉన్న సహనాన్ని కోల్పోతే, నీ ఆస్థి, కోర్టు ఖర్చుల కంటే నీకు వాటిల్లే నష్టమే ఎక్కువ అవుతుంది.

క్రైస్తవుడు తన వ్యక్తిగత స్వాతంత్ర్యము పై ఎవడైనా దాడి చేసినా, దాన్ని సహించాలని ప్రభువు బోధించారు. ఎవడైనా ఒక మైలు దూరము రమ్మని బలవంతము చేసిన యెడల వానితో రెండు మైళ్ళు వెళ్ళుము. అతనితో కీచులాడుట కంటె రెండో మైలు వెళ్ళుట మంచిది. నేటి మన స్వాతంత్ర్యం అంతా ఎవరో ఒకరు సహించుట వలననే మనకు కలిగినది. యేసు ప్రభువు సిలువను సహించి పాపపు బానిసత్వము నుండి మనకు స్వాతంత్ర్యము నిచ్చారు. అందువలన వ్యక్తిగత స్వాతంత్ర్యము విషయంలో నిన్ను నీవు ఉపేక్షించుకొనుట మంచిది.

## దాతృత్వము విస్తరించాలి

అంతేకాదు, మన దాతృత్వము కూడ విస్తరించాలని యేసు ప్రభువు బోధించారు. మనం ఇచ్చుటకు ఎల్లప్పుడు సంసిద్ధులమై యుండాలి. "నిన్ను అడుగు వానికిమ్ము". బీదలు నిన్ను అభ్యర్థించినప్పుడు, దాతృత్వము చేయుటకు అది దేవుడిచ్చిన తరుణమని తలంచాలి. బీదలు చాచిన చేతులలో, మనం దేవుని చేతులనే చూస్తున్నామేమో. దేవునికిచ్చుటకు ఎవడు నిరాకరిస్తాడు? అట్లు మనం సహాయం చేస్తే, తీర్పుదినమున దేవుడు, "మిక్కిలి అల్పులైన యీనా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానను" (మత్తయి 25:40). మనం సహాయం చేయుటకును, అప్పుయిచ్చుటకును సంసిద్ధులమైయుండాలి.

తద్వారా ఆపదలలో నున్నవారిని ఆదుకోగలము. అట్లు చేయుటలో మనం విచక్షణ కలిగి యుండాలి. "దయాళులును, అప్పిచ్చువారును భాగ్యవంతులు. న్యాయ విమర్శలో వారి వ్యాజ్యెము గెలుచును" అని దావీదు మహారాజు చెప్పుచున్నాడు (కీర్తన 112:5). మనం విచక్షణ లేకుండ దానం చేస్తే, సోమరులును, దుర్మార్గులును మనలను త్వరలో దివాలా చేయించేస్తారు.

ఈ లోకంలో మనకు న్యాయం జరుగదు. దుష్టులు మనకు చేసే కీడుకు ప్రతికీడు చేయాలని మనం తలస్తుయుంటే ఈ జీవితం అంతాపగతోను, ఈర్ష్యతోను నిండియుంటాది. అట్లుకాక కీడును సహిస్తు క్రీస్తును వెంబడించిన యెడల ఆయన ప్రతి అతిక్రమానికి, అన్యాయానికి తగిన శిక్ష విధిస్తాడు. నిశ్చయముగా క్రీస్తు మార్గము శాంతి మార్గమే!

-జాషువా గూటం

## మీ వలలను వేయండి.

## (Let down Your Nets)

లూకా సువార్త 5వ అధ్యాయములో పేతురు యొక్క విశ్వాసమును పరీక్షించుటకు ఒక సవాలు చేయబడినది. పేతురు రాత్రంతయు చేపలను పట్టుటకు వలలు వేసి ప్రయాసపడినను ఏమియు దొరుకక అలసటతో వలలు కడుగుచుండెను. యేసు అక్కడకు వచ్చి ఆ దోనెలలో సీమోను దైన ఒక దోనెను ఎక్కి దరి నుండి కొంచెము త్రోయుమని అతని నడిగి కూర్చుండి దోనెలో నుండి జన సమూహములకు బోధించుచుండెను. ఆయన బోధించుట చాలించిన తరువాత "నీవు దోనెను లోతునకు నడిపించి చేపలు పట్టుటకు మీ వలలు వేయుడని" సీమోను తో చెప్పెను. పేతురు సందేహించాడు. పేతురు చాలా అనుభవము కల్గిన జాలరి. రాత్రంతయు ప్రయాసపడి తన పనిలో నిమగ్నమై యున్నాడు కాని ఒక్క చేపను కూడా పట్టలేకపోయెను. ప్రభువు

సూచించారు కనుక చివరకు ఆయన కోరిన ప్రకారము చేయుటకు సమ్మతించాడు. అటువలె విశ్వాసులైన వారందరు ప్రభువు చెప్పిన ప్రకారముగా చేయుటకు సిద్ధపడవలెను.

"సీమోను:- ఏలినవాడా, రాత్రి అంతయు మేము ప్రయాస పడితిమి గాని మా కేమియు దొరకలేదు. అయినను నీ మాట చొప్పున వలలు వేతుమని ఆయనతో చెప్పెను" (లూకా 5:5).

## ఆశ్చర్య ఫలితము

దీని ఫలితము చాలా ఆశ్చర్యముగా యున్నది. వారు విస్తారమైన చేపలు పట్టిరి. అందుచేత వారి వలలు పిగిలి పోవుచుండగా వారు వేరొక దోనెలోనున్న తమ పాలివారు వచ్చి తమకు సహాయము చేయుటకు వారిని పిలిచిరి. వారువచ్చి రెండు దోనెలు మునుగునట్లు చేపలతో నింపిరి. పేతురు విస్మయమొంది యేసు పాదములపైపడి తాను ఆయన ఎదుట అయోగ్యుడని ఒప్పుకొనెను. అందుకు యేసు "భయపడకుము, ఇప్పటినుండి నీవు మనుష్యులను పట్టు జాలరివై యుందువని" సీమోనుతో చెప్పెను (లూకా 5:10). వారు దోనెలను దరికి చేర్చి సమస్తమును విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి. పేతురు మొదట సందేహించి నప్పటికిని, తన జీవితములో అనేక పర్యాయములు ప్రేరేపణలకు గురియైనను దోనెలో నేర్చుకున్న పాఠముద్వారా అతడు మనుష్యులను పట్టుజాలరిగా బయలుదేరెను.

## సువార్త వల

పెంతెకోస్తు పండుగ దినమున యెరూషలేములో కూడిన జన సమూహముతో పేతురు ప్రసంగించిన విషయమును లూకా అపోస్తలుల కార్యములు 2 వ అధ్యాయములో గ్రంధస్తము చేసెను. దేవుడు పేతురుతోను మరియు ఇతర అపోస్తలులతోను సువార్త వలను వేయుడని చెప్పెను. ఇది అనుకూల సమయము కాదు మరియు అనుకూల స్థలము కాదు అని పేతురు వాదించియుండవచ్చు. అంతేకాక, ఈ ప్రదేశములోనే యేసు మరణమునకు

అప్పగింపబడెను. మరియు ఈ ప్రజలే తమ క్రూరమైన చేతులతో మన ప్రభువును సిలువ వేసిరి. ఇక్కడ మంచి ఫలితము ఉండదు అని తలంచి యుండవచ్చు కాని దేవుని యొక్క సూచన మేరకు పేతురు సువార్త అనెడి వలను విసిరెను. అది మూడువేలమంది ఆత్మలతో నిండెను.

అపోస్తలులు కార్యము 10 వ అధ్యాయములో పేతురు సువార్త అనెడి వలను అన్యుల మధ్య వేయుటకు నడిపింపబడెను. ఆ విధముగా చేయుటకు ఇది సమయమని ఒక సాదృశ్యమైన దర్శనము ద్వారా అతనికి చూపించబడినది. ఆ విధముగా అతడు వల వేయుట వలన భక్తిపరుడైన కొర్నేలి ఇంటివారందరి తోను అది నింపబడెను.

సువార్త అనెడి శక్తివంతమైన వలను పేతురు రెండువేల సంవత్సరముల క్రితము వేసెను (రోమా 1: 16). "సువార్త ను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగ జేయుటకు అది దేవుని శక్తియై యున్నది". తరువాత వృద్ధుడైన పేతురు ఈ విధంగా వ్రాయుచున్నాడు: "సర్వ శరీరులు గడ్డిని పోలినవారు. వారి అందమంతయు గడ్డిపువ్వు వలె ఉన్నది. గడ్డి ఎండును. దాని పువ్వును రాలును. అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును. మీకు ప్రకటింపబడిన సువార్త ఈ వాక్యమే". ( I పేతురు 1 : 24).

## నేడు కూడ ప్రాచీనవలయే

నీ చేతిలోనున్న వల ఏమిటి? ప్రాచీనమైన సువార్త యేనా? అయితేదానిని వేయుము! ఎప్పుడు వేయాలి? "సమయమందును, అసమయమందును ( II తిమోతి 4:2). ఎవరికి? ఎక్కడవేయాలి? "భూనివాసులకు అనగా ప్రతి జనమునకు, ప్రతి వంశమునకు, ఆయా భాషలు మాట్లాడు ప్రతి ప్రజకు " (ప్రకటన 14:6). అవిశ్వాసులైన జనులు దీనికి అడ్డు చెపుతారు. ప్రాచీనమైన సువార్త నవ్య ప్రపంచములో పనిచేయదు అని వారు చెపుతారు. నవీన మానవునికి ప్రాచీన సువార్తకు మధ్య అనేకమైన అనుసంధాన కర్తలున్నారని

వారు చెప్పుదురు. కనుక నీవలను తగిన విధముగా మార్చుమని నిన్ను ఉద్రేక పరుస్తారు. కాని ప్రాచీనమైన ఆ సువార్త పరలోకములో తయారైనది. అది నిత్యము నిలిచియుండేది. మన ప్రభువు ఆవలను వేయుమని నిన్ను కోరుచున్నాడు. ఫలితమును ఆయనకే వదిలివేయుము. ఆమన మాట ఎడల నీవు ఏమి చేయుదువు?

- టిమ్ నికోలన్**(vot).**

## మీ వెలుగును ప్రకాశింప నియ్యుడి

## (Let Your Light Shine)

కొండ మీది ప్రసంగమును మనము చదువు చున్నపుడు యేసు ఆ ప్రసంగమును కొండమీద చేయుటకు గల పరిస్థితులను గూర్చి కొన్ని విషయములు తెలిసి కొన వలసిన వారము. ఆ దినముల యందు ఆయన ప్రార్ధన చేయుటకు కొండకు వెళ్లి, దేవుని ప్రార్ధించుట యందు రాత్రి గడిపెను. ఉదయమైనప్పుడు ఆయన తన శిష్యులను పిలిచి, వారిలో పండ్రెండు మందిని యేర్పరచి వారికి అపొస్తలులు అను పేరు పెట్టెను (లూకా 6:12-20). ప్రభువైన యేసు అప్పుడే పండ్రెండు మంది శిష్యులు ఆయనతో కలసి యెల్ల వేళల పనిచేయుట కొరకు యేర్పరచుకొనెను. యేసు పరలోకమునకు తిరిగి వెళ్లుసరికి సంఘములో ఏర్పరచబడిన నాయకులుండుటకొరకు శిష్యుల నేర్పరుచుకొని వారికి పండ్రెండు మంది అపొస్తలులని పేరు పెట్టెను. ఈ ప్రసంగములోని మొదటి అంశము మీ వెలుగును ప్రకాశింప నియ్యుడి. (మత్తయి 5:14-16). నా చిన్నదివ్వె అను పాట యొక్క సారాంశము యేసు తన శిష్యులకు "మీరు లోకమునకు వెలుగైయున్నారని" చెప్పిన వాక్యమునకు (16వ) ఆధారముగ యున్నది.

ఈ మధ్య కలిగిన గొప్ప తుఫానులను బట్టి వెలుగు యొక్క ప్రాముఖ్యతను గూర్చి అనుభవ పూర్వకముగా గ్రహించి యుంటిమి. ఒక చీకటి

గదిలో చిన్న క్రొవ్వు వత్తి యొక్క వెలుగు ఎంతో యెక్కువగ యుండును. అదే రీతిగ ఈ చీకటితో నిండిన పాపలోకములో ఒక క్రైస్తవుని జీవితము ఎంతో ప్రకాశవంతముగ యుండునని ప్రభువైన యేసు ఆయన శిష్యులకు తెలియజెప్పుచుండెను. ఈ నశించి పోవుచున్న లోకమునకు శిష్యులు తమ వెలుగును ప్రకాశింప చేయవలసి యున్నది.

## వెలుగు మంచిది

సృష్ట్యారంభములో దేవుడు వెలుగును చేసి అది మంచిదైనట్టు చూచెను. వెలుగులో మనము అన్నింటిని స్పష్టముగ చూడగలము గనుకనే వెలుగు మంచిది. చీకటి చాల భయంకరముగ యుండును. కాని వెలుగు ప్రకాశింపగనే మంచి, చెడుగల తారతమ్యములను గ్రహించగలము, పెద్ద పెద్ద ఓడలను సురక్షిత ప్రాంతాలకు నడిపించునది చిన్న వెలుగే కదా! వెలుగు పరిశుద్ధంగ యుంటుంది గనుక వెలుగు మంచిది. గాలిని, నీటిని మనము మురికి చేయగలము,కాని వెలుగును మాత్రము మనము పాడు చేయలేము. వెలుగుకు స్వస్థపరచు గుణము కూడ ఉన్నది గనుక వెలుగు మంచిది. ఎండ లేకుండా మబ్బుగా యుండిన సమయాలలో మనము ఎన్నోసార్లు వెలుగు కొరకు, ఎండ కొరకు ఆశిస్తాము. సూర్య కిరణములలో రోగనిరోధక శక్తిని వృద్ధిపొందింప జేసే లక్షణమున్నది. కీడు నుండి, ఆపద నుండి మనలను తప్పించును గనుక వెలుగు మంచిది. చాల చెడ్డపనులన్నియును చీకటి లోనే జరుగును. జీవితమును సాధ్యపరచుటకుగాను, వెలుగు దోహద పడుచున్నది. గనుక వెలుతురు మంచిది.

వెలుగు మంచిది. దేవుడే వెలుగై యున్నాడు. ప్రభువైన యేసే వెలుగు. క్రైస్తవులమైన మనము వెలుగువలె ప్రకాశించ వలెను. మీరు లోకమునకు వెలుగైయున్నారని యేసు ప్రభువు చెప్పెను. (మత్తయి 5:14). మనద్దై నందిన జీవితములో లోకములో యేసు ప్రభువు కొరకు వెలుగు వలె ప్రకాశించవలెను. అప్పుడు మన జీవితములు బంగారు దివ్వెల వలె నుండును.

- ఫ్రాన్సిస్ విలియం

# సంక్షిప్త వార్తలు

నవంబరు నెల సువార్తికుల సభస్సు 22వ తేదీన చెయ్యేరులో ఘనంగా జరిగెను. ఆయా జిల్లాలలో క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు, క్రీస్తు రాజ్యవ్యాప్తికై అహర్నిశలూ శ్రమించుచున్న సువార్తికుల సమక్షంలో "ఐక్యతకు అవరోధం కలిగించే వాటిని అధిగమించి సహోదరుల మధ్య ఏకత్వమును సాధించుట ఎట్లు?" అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు పాల్‌గూటం గారు అధ్యక్షులుగా ఉండి చర్చను నడిపించిరి. సోదరులు డి.ఇశ్రాయేలు రాజు, చుక్కా అప్పారావు, బి.యోహాను, యు.స్టాలిన్, డి.రంగారావు, ఎస్.సుబ్బారావు, ఎలిషే ప్రభాకరరావు గార్లు చర్చతో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు చుక్కా అప్పారావుగారు అధ్యక్షులుగా ఉండి కార్యక్రమమును చక్కగా నడిపించిరి. సోదరులు జె.జాన్‌బాబు, కె.తాతారావు, పాల్ గూటం, జె.ప్రసాదరావు మరియు జాషువా గూటం గార్లు పై అంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

ఐక్యతను కాపాడు కొనుటయందు సహోదరులు శ్రద్ధ కలిగిన వారై యుండాలని పౌలు ఎఫెస్సీ సంఘమును హెచ్చరించెను (ఎఫె. 4 : 1-2). ఐక్యతకు ఆటంకం కలిగించే వాటిని గుర్తించి వాటిని అధిగమించుటకు సహోదరులు సంసిద్ధులై యుండాలి. ఎక్కడైతే ఐక్యత లోపిస్తుందో అక్కడ అపజయం కలుగుతుంది, శత్రువు యొక్క పని సులభతరమౌతుంది. మనుష్యుల మధ్య వ్యత్యాసాలు, భౌతిక అవసరాలు, విదేశీసహాయం, అసూయ, ఇలాంటి వేమీ ఐక్యతకు అవరోధం కాకూడదు. మనమందరము విశ్వాస విషయములోను దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములోను ఏకత్వము పొందవలెనని పౌలు వ్రాయుచున్నాడు (ఎఫె 4 : 11-12). ఎందుకంటే మనం ఒకే శరీరంలో అవయవములమై యున్నాము. సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట

యందు శ్రద్ధ కలిగి యుండాలి. అబద్ధ బోధలు బహుళ ప్రచారంలో ఉన్న నేటి దినాల్లో ఐక్యత మన లక్ష్య సాధనకు అవసరం. అనైక్యత వలన సంభవించే దుష్పరిణామాలు సంఘక్షేమాభివృద్ధికి విఘాతం కలిగిస్తాయని వివరించిరి.

క్రీస్తు ఏకత్వము నిమిత్తమై ప్రార్థించెను (యోహా 17 : 20-21). సత్యమందు ఏకత్వమున్నది. అంటే వాక్యము ఎక్కడ బోధించినను ఒకే సత్యము బోధించుచున్నది. సత్యము విషయంలో రాజీ ధోరణి లేకుండుట ఐక్యత.

సోదరులు ఇ.కె.వి. ప్రసాదరావు గారు మరియు
చెయ్యేరు, అనాతవరం, సింగరాయపాలెం క్రీస్తు సంఘములు చక్కని ఏర్పాట్లు చేసి
సదస్సును ఘనంగా నిర్వహించిరి.

---

Regd. No. H/KD-45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
SATYA WAKKU
P.O.Box: 80
KAKINADA - 533 001

No.

To
..........................................
..........................................
..........................................